# ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తతే ప్రాణ రక్షణ



-బూర్గంపాడులో భారీస్థాయిలో మాక్ డ్రిల్
-సమన్వయంతో పని చేస్తే ప్రాణ, ఆస్తి నష్టాలు తగ్గింపు సాధ్యం
- కలెక్టర్ అంకిత్

సెంటర్ స్ప్రెడ్

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 19 | మే | 2026
పేజీలు : 7

# ఈ విపత్తు వీడేదెన్నడో..?



- నిలిచిన క్రయ, విక్రయాలు
- కరతుమ్మలు మొలుస్తున్న వెంచర్లు

స్తంభించిన స్థిరాస్తి వ్యాపారం



రెండు దశాబ్దాల పాటు మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా వర్థిల్లిన స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపారం ఇప్పుడు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. రెండేళ్లుగా క్రయ, విక్రయాలు నిలిచిపోయి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. ఇది ఒక ప్రాంతానికో ఓ జిల్లాకో పరిమితం కాలేదు. మొత్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. రూపాయికి రూపాయి లాభం వస్తుండడంతో చాలా మంది ఇండ్లు, నివాస స్థలాలు, వ్యవసాయ భూముల కొనుగోళ్లు, అమ్మకాలపై దృష్టిసారించారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగాగా సాగగా ఖమ్మం, హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఈ జోరు ఎక్కువగా సాగింది.

-ప్రజాపక్షం/ఖమ్మం

2లో

# కార్పొరేట్ కాపలదారుగా మోడీ




-మాటలకే పరిమితమైన రేవంత్ సర్కార్
-ఈనెల 29, 30 తేదీల్లో నిరసన దినాలు
-సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్

ప్రజాపక్షం/ ఖమ్మం : మోడీ దేశ ప్రధానిగా కాకుండా కార్పొరేట్ శక్తుల, వ్యక్తుల కాపలదారుగా పనిచేస్తున్నారని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్ ఆరోపించారు. మోడీ హయాంలో కార్పొరేట్ శక్తులు ప్రజల సొమ్మును తమవైపుకు తిప్పుకున్నా

మిగతా 2లో..

# కాంగ్రెస్‌లో నామినేటెడ్ లొల్లి



-భగ్గుమన్న రేణుకాచౌదరి
-సమన్వలోపం శాపం కానుందా...?

ప్రజాపక్షం/ ఖమ్మం : అధికార కాంగ్రెస్‌లో నామినెటెడ్ పదవులు భిన్న స్వరాలకు తావిస్తున్నాయి. ఇటీవల ప్రకటించిన పదవులకు సంబంధించి సమ న్యాయం జరగటం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికే ముగ్గురు మంత్రుల మధ్య సమన్వయం లేదన్న ప్రచార నేపథ్యంలో రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. నామినెటెడ్ పదవులకు సంబంధించి ఘాటైన విమర్శలు చేశారు. అసలైన కాంగ్రెస్ కార్యకర్తలు అప్పుడు బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనూ ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రేణుక ఘాటైన విమర్శలు ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఖమ్మం జిల్లాకు సంబంధించి ఐదు నియోజకవర్గాలు ఉండగా ఐదింటిని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. వీరిలో మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు లు రాష్ట్ర మంత్రి వర్గంలో సభ్యులుగా ఉన్నారు. ఈ ముగ్గురు ప్రధాన శాఖలను నిర్వహిస్తున్నప్పటికీ సమన్వయం లేదన్న కారణంగానే సుడా ఛైర్మన్ సహా పలు నామినెటెడ్ పోస్టుల భర్తీపై తీవ్ర తాత్సరం జరిగింది. ఎట్టకేలకు మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ను

మిగతా 2లో..

# ఈ విపత్తు వీడేదెన్నడో..!?

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రెండు దశాబ్దాల పాటు మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా వర్థిల్లిన స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపారం ఇప్పుడు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. రెండేళ్లుగా క్రయ, విక్రయాలు నిలిచిపోయి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. ఇది ఒక ప్రాంతానికో ఓ జిల్లాకో పరిమితం కాలేదు. మొత్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. రూపాయికి రూపాయి లాభం వస్తుండడంతో చాలా మంది ఇండ్లు, నివాస స్థలాలు, వ్యవసాయ భూముల కొనుగోళ్లు, అమ్మకాలపై దృష్టిసారించారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగాగా సాగగా ఖమ్మం, హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఈ జోరు ఎక్కువగా సాగింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రకు చెందిన పలువురు వ్యాపారులు ఖమ్మం, హైదరాబాద్ చుట్టు పక్కల స్థానికులతో కలిసి రియల్ వ్యాపారాలు చేశారు. ఒక ఖమ్మంను ఉదాహరణగా తీసుకుంటే ఖమ్మం నగరానికి 25 కిలో మీటర్ల ఎటు చూసినా వ్యవసాయ భూములన్ని రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోయాయి. కొనుగోలుదారులు, అమ్మకందారులు వస్తూ పోతూ కార్ల జోరుతో శివారు ప్రాంతాలు కొత్త సందడిని సంతరించుకునేవి. నివాస స్థలాలు, భవనాలతో పాటు వ్యవసాయ భూముల ధరలు కూడా గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఖమ్మం ఖమ్మం నగరంలోనే 50వేల కుటుంబాలు రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ప్రత్యక్షంగా ఆధారపడగా లక్షల కుటుంబాలు పరోక్షంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఆధారపడి జీవించాయంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడు కొనుగోళ్లు, అమ్మకాలు లేక మరో ఉపాధి మార్గం లేక సతమతమవుతున్నారు. కొందరు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి కుటుంబాలే ముఖం చాటేసే పరిస్థితి దాపురించింది. భవన నిర్మాణాలు వేగంగా జరుగుతున్న సమయంలో నిర్మాణ రంగంపై ఆధారపడిన సుతారులు, సెంట్రీంగ్, రాడ్‌బెండింగ్, పెయింటర్స్‌తో పాటు ఇసుక, ఇటుక, సిమెంట్ రంగాల్లో పనిచేసే కార్మికులకు చేతినిండా పని దొరికేది. భవన నిర్మాణంపై ఆధారపడిన వ్యాపారాలు కూడా బాగా పుంజుకున్నాయి. కానీ ఇప్పుడు రియల్ వ్యాపారం సంక్షోభంలో కూరుకుపోయిన తర్వాత దీనిపై ఆధారపడిన వ్యాపారాలు చతికిలబడగా మరో ఉపాధి మార్గం లేక లక్షల కుటుంబాలు నైరాశ్యంలో కూరుకుపోయాయి. ఒక రూపాయికి రూపాయి లాభం వస్తుందని ఆశ పడి భూములు, నివాస స్థలాలు అప్పులు చేసి కొనుగోలు చేసిన వారు ఇప్పుడు వాటిని విక్రయించ లేక, కొనేనాథుడు లేక వడ్డీలు చెల్లించలేక నరక యాతన అనుభవిస్తున్నారు. గతంలో ఉన్న ఆస్తులు మొత్తం తుడ్చిపెట్టుకుని పోయే దయనీయ పరిస్థితి ఏర్పడింది. ధర తగ్గించి అమ్ముదామన్న అసలు కొనే నాథుడే లేడు. ఖమ్మం చుట్టూ పక్కలతో పాటు జిల్లా వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వెంచర్లలో పిచ్చిచెట్లు కర తుమ్మలు మొలుస్తున్నాయి. సిమెంటు రోడ్లు, బిటి రోడ్లు వేసిన వెంచర్లలో సైతం కనీసం జన సంచారం కనిపించడం లేదు. రియల్ భూమిలో వ్యవసాయ భూముల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. ఎక్కడో మారుమూల గ్రామాల్లో సైతం వ్యవసాయ భూమి రూ25లక్షలకు పైబడి పలికింది. మధిర, వైరా, సత్తుపల్లి, పాలేరు నియోజక వర్గాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో వ్యవసాయ భూములను కొనుగోలు చేశారు. ఇప్పుడు ఆ భూములు తిరిగి కొనేవారు లేకపోయారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం స్తంభించడంతో ప్రతి నెల కోట్లలో టర్నోవర్‌లో ఉండే వ్యాపారాలు నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం సంక్షోభంలో ఉన్న దశలో భూముల ధరలు పెంచుతామని ప్రకటించడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ఉందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం తిరిగి పుంజుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రియల్ ఎస్టేట్ సంక్షోభం తర్వాత ప్రతి యేటా కోట్లాది రూపాయల ఆదాయాన్ని కోల్పోతుంది. ఒక ఖమ్మం జిల్లాలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా వచ్చే ఆదాయంలో సుమారు 60 శాతాన్ని కోల్పోయిందంటే రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి ఏవిధంగా ఉందో ఆలోచించుకోవచ్చు. లక్షలాది కుటుంబాల జీవితాలతో ముడిపడిన రియల్ ఎస్టేట్ వ్యాపారం పునర్జీవానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాల్సి ఉంది. ఈ విపత్తు నుంచి గట్టేక్కించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సంక్షోభం నుంచి గట్టేక్కించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# కాంగ్రెస్‌లో నామినేటెడ్ లొల్లి

**(మొదటిపేజీ తరువాయి)** సుడా ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా మహ్మద్ ఖాదర్‌బాబా ఎంపిక పైన తుమ్మల శిబిరంలోనే భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. పలు పార్టీలు మారిన వ్యక్తికి గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఇచ్చారని ఆది నుంచి కాంగ్రెస్‌ను నమ్ముకున్న వ్యక్తులకు కాకుండా వలస వ్యక్తులకు గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఇచ్చారని పలువురు అసంతృప్తితో ఉన్నారని భద్రాచలం ట్రస్టు బోర్డుతో సహా ప్రధానమైన నియామకాలపైన చాలా మంది ఆశలు పెంచుకున్నారు. కానీ ఈ ముప్పురిలో ఎవరికి పదవి వస్తుందో ఎవరికి మొండి చేయి చూపుతారో అర్థం కాని స్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు బిఆర్ఎస్‌లో ఉండి పెత్తనం చేసిన వారే ఇప్పుడు కాంగ్రెస్‌లోనూ చలామణి అవుతున్నారని అప్పుడు ఇప్పుడు కాంగ్రెస్ జెండాలు మోసిన వారు తీవ్ర నిరాశకు గురవతున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రుల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలకు తావులేకున్న ఎక్కడో ఒక సన్నని గీత విడదీస్తుందన్న భావన ప్రజల్లో ఉంది. రేణుకాచౌదరి అంతర్గత విషయాలపై చాలా కాలం తర్వాత నోరు విప్పారు. ఆమె ప్రధానంగా ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్కను టార్గెట్ చేసినట్లు అవగతమవుతుంది. అత్యుత్తమ ఫలితాలను అందించిన ఖమ్మం జిల్లాలో ఈ రీతి కొనసాగితే సమన్వయ లోపం శాపంగా మారే ప్రమాదం ఉంది. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా విడిపోయి నాయకుల అనుచరులుగా పనిచేస్తున్నారు. తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా బాధ్యతలు చేపట్టి 40 వసంతాలు గడిచిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఖమ్మం జిల్లాకు సంబంధించిన మిగిలిన ఇద్దరు మంత్రులు, ఇద్దరు శాసన సభ్యులు హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. పెద్ద ఎత్తున జరిగిన ఈ సభకు సంబంధించి తుమ్మల మినహా మిగిలిన నాయకుల అనుచరులు పాల్గొనకపోవడం బేధాభిప్రాయాలు ఉన్నాయన్న వాదనకు తావిచ్చింది. ఆది నుంచి కాంగ్రెస్‌కు బలమైన జిల్లాగా ఉన్న ఖమ్మంలో గ్రూపుల లొల్లి పలు సందర్భాల్లో ఆ పార్టీకి తీవ్ర నష్టాన్ని చేసింది. మంత్రులుగా, శాసన సభ్యులుగా ఈ జిల్లాను అభివృద్ధి పదంలో నడిపిస్తున్న సమయంలో పార్టీలో భిన్నాభిప్రాయాలు నష్టచేసే పరిస్థితి ఉన్నది. అమాత్యులు ఈ విషయంపై ఆలోచించి సమన్వయం దిశగా చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ అభిమానులు కోరుతున్నారు.

# కార్పొరేట్ కాపలదారుగా మోడీ

**(మొదటిపేజీ తరువాయి)**
యని, దేశ సంపద ఒకరిద్దరి చేతుల్లో పోగుపడిందని ఆయన తెలిపారు. సోమవారం సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఠాగూర్ మాట్లాడుతూ దేశ ప్రజలను పొదుపు పాటించమని చెబుతున్న మోడీ 2015 నుంచి 2022 వరకు ఆయన విదేశీ ప్రయాణ ఖర్చుల కోసం రూ.762 కోట్లు ఖర్చు చేశారన్నారు. వేల కోట్ల రూపాయల విమానాల్లో ప్రయాణిస్తూ లగ్జరీ జీవితాన్ని గడుపుతూ ప్రజా ధనాన్ని వృధా చేస్తున్న మోడీ ముందు పొదుపు పాటించాలని ఠాగూర్ సూచించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత మోడీ ఈనెల ఎనిమిదిన నాలుగు లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తీసుకువస్తున్నట్లు ప్రకటించిందని ఆయన తెలిపారు. దీనితో కార్మిక వర్గం హక్కులను కోల్పోతుందని కేవలం కార్పొరేట్ల సానుకూలత కోసమే లేబర్ కోడ్లను తీసుకు వచ్చారని ఠాగూర్ తెలిపారు. నీట్ యుజి 2026 పరీక్షల పేపర్ లీక్ కావడం ద్వారా ఈ దేశంలో 22.75 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని పేపర్ లీకేజీకి సంబంధించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తక్షణం రాజీనామా చేయాలని ఠాగూర్ డిమాండ్ చేశారు. అస్సాం, బెంగాల్, పాండిచ్చేరి రాష్ట్రాల్లో బిజెపి గెలుపు వెనక అనేక కారణాలు ఉన్నాయని ముఖ్యంగా ఆర్ఎస్ఎస్, బిజెపి మత ప్రాతిపదికన ప్రజలను విడదీశారన్నారు. కొన్ని ప్రాంతాల్లో ముస్లిం ఓట్లను మొత్తంగా తొలగించారని ఇప్పుడు అధికారంలోకి రాగానే ముస్లింల మీద తన ప్రతాన్ని చూపిస్తుందని ఆయన తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచారని మరోసారి పెంచేందుకు ఈ ప్రభుత్వం సిద్దమవుతుందని ఆయన తెలిపారు. అమెరికా గౌతమ్ అదానీ, సాజన్ అదానీలకు వ్యతిరేకంగా ఉన్న కేసులను రూ.60 లక్షల యుఎస్ డాలర్లను ఒకరి వద్ద నుంచి మరొకరి వద్ద నుంచి 120 లక్షల యుఎస్ డాలర్లు పొంది కేసులను ఉపసంహరించుకునేందుకు ప్రయత్నిస్తుందన్నారు. భారతదేశ సంపదను అదానీ, అంబానీలు లూటీ చేస్తున్నారని ఠాగూర్ ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ప్రతిపక్షాలను లేకుండా చేయడం కోసం ప్రయత్నిస్తుందన్నారు.మీడియా స్వేచ్ఛలో ఈ దేశం 152వ స్థానానికి పడిపోయిందన్నారు. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి సర్కార్ కేవలం మాటలకే పరిమితమైందని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. బిజెపి ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా మే 29, 30 తేదీల్లో నిరసన దినాలు పాటించాలని మాస్‌లైన్ పిలుపునిస్తుందన్నారు. ఈ మీడియా సమావేశంలో దేవభ్రత శర్మ, అజీజ్ చక్రవర్తి, ఉమాకాంత్, రాంచందర్, కె. రమా, ఉమాకాంత్, పూజారి, కె. రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

-బ్యాంకు లింకేజీ లక్ష్యాలను సాధించాలి
-మధిర ప్రాంత అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మధిర నియోజక వర్గ ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. మధిర నియోజక వర్గ ప్రాంతంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి శాఖల వారీగా పనుల వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధిర నియోజక వర్గ పరిధిలోని చింతకాని మండలంలో సాచ్యురేషన్ మోడ్‌లో లబ్దిదారులకు మంజూరైన దళితబంధు యూనిట్లు గ్రౌండిం గ్ పూర్తి చేసినవి, వాటిలో సిక్ యూనిట్లు, విజయవంతంగా నడుస్తున్న యూనిట్లు, డైవర్ట్ అయిన యూనిట్లపై పూర్తి స్థాయి నివేదికలను సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. జమలాపురం పర్యాటక అభివృద్ధికి ఐదు కోట్లు మంజూరై టెండర్లు, ఒప్పందాలు పూర్తయ్యాయ ని ఆగస్టు 31 నాటికి సరస్సు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళా సాధికారతలో భాగంగా బ్యాంక్ లింకేజీ లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలన్నారు. ప్రతి నెల కొత్త రుణాలకు అర్హత పొందే సంఘాల అంచనాలు సిద్ధం చేసి నెలవారి లక్ష్యాలను నిర్ణయించాలని సూచించారు. ఆర్పిలు సమన్వయం సహాయక సంఘాలతో నిరంతరం సమన్వయం చేస్తూ రుణాల వినియోగం సక్రమంగా జరిగేలా చూడాలని తెలిపారు. టిజిఐఐసి పరిధిలో 84.17 ఎకరాల్లో చిన్న తరహా పరిశ్రమల కోసం అభివృద్ధి చేస్తున్న 264 ప్లాట్ల పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో యూజిఇ పైపులైన్లు, ఇతర అభివృద్ధి పనులపై ని రంతర పర్యవేక్షణ ఉండాలని, ఎస్టిపి కోసం అవసరమైన భూసేకరణ పనులు త్వరగా పూర్తి చే యాలని తెలిపారు. వైరా రిజర్వాయర్ పర్యాటక అభివృద్ధికి 14 కోట్లు ప్రతిపాదనలు పంపగా ఐదు కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అభివృద్ధి పనుల డిజైన్లను 15 రోజుల్లో ఖరారు చేయాలని సూచించారు. మధిరలో వృద్ధాశ్రమం ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలపగా అన్ని మౌలిక వసతులతో ఏర్పాటు చేయాలని త్రాగునీరు, మరుగుదొడ్లు, వంట గది వంటి సదుపాయాలతో వృద్ధాశ్రమం ఏర్పాటు చేసేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ మున్సిపాలిటీలో యూజిడి, వరద నీటి నిర్వహణ ప్రాజెక్టు, వీధి వ్యాపారుల పునరావాస ప్రాజెక్టు, రిటైనింగ్ వాల్ వంటి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. సమావేశంలో ఆర్డివో శ్రీనివాస్, సంబంధితఅధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మానవ జీవితంలో అత్యంత విలువైన అనుభవం విద్యార్థి దశ విద్యార్థి దశలో తమ తోటి స్నేహితులతో చదివిన పెరిగిన ప్రాంతం చదువుకున్న పాఠశాల ఎంత మధురానుభూతులు కలిగిస్తాయి. సుమారు 30 సంవత్సరాలు క్రితం పిండిప్రోలు పాఠశాలలో 94 నుండి 98 వరకు ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు తమతోపాటు చదువుకున్న తోటి విద్యార్థులతో పిండిప్రోలు గ్రామంలోని కేశవాపురం రోడ్లో ని ఫంక్షన్ హాల్ లో పిండిప్రోలు జెడ్పిఎస్ఎస్ హైస్కూల్లో 9498 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఎంతో ఘనంగా సన్మానం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుల విద్యార్థులు మాట్లాడుతూ పిండిప్రోలు హై స్కూలు ఎంతో ప్రాముఖ్యతను అనుభవాలను నింపిందని మేము ఏ స్థాయిలో ఉన్న విద్యాబుద్ధులు నేర్పినం స్కూల్ ని పెరిగిన పిండిప్రోలు గ్రామాన్ని ఎప్పటికీ మర్చిపోమని జీవితంలో అదొక మధురానుభూతిని గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు తమకు విద్యార్థులు నేర్పడం ద్వారా ఇప్పుడు మేము వివిధ ప్రభుత్వ ప్రైవేటు వ్యాపార రంగాల్లో స్థిరపడ్డామని గురువులను పూర్వ విద్యార్థుల కొనియాడారు. 94 98 మధ్య పిండిప్రోలు హైస్కూలులో అప్పటి ఉపాధ్యాయులు ఎంతో ఉన్నత విద్యను అందించారని అలాంటి మహానుభావుల విద్యాబుద్ధులతో మేము ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడ్డామని జీవితంలో ఎప్పటికీ పిండిప్రోలు హైస్కూలు ఉపాధ్యాయులు తమ హృదయాల్లో నిలిచిపోతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు , వీరభద్రం, భాస్కర్ రావు, శ్రీనివాసరావు సూరమ్మ, సుధాకర్, రామ సీత,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి : డిఎస్‌పి




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని డిఎస్‌పి ఆదినారాయణ అన్నారు. రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఎల్అండ్ఎం ఫంక్షన్ హాల్లో సోమవారం జరిగిన మతపెద్దల పీస్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పండుగ వాతావరణం మత సామరస్యానికి ప్రతీకగా ఉండాలని, ఆయా మతాలపెద్దలు ప్రజల్లో సమన్వయం ఏర్పడేలా చూడాలన్నారు. చట్టవ్యతిరేక విధానాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ పీస్ కమిటీ సమావేశంలో అన్ని మతాల పెద్దలతో పాటు సిఐలు ప్రతాప్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల సూచనలు ప్రజలు పాటించాలి

-అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమైన పత్రాలను భద్రపర్చుకోవాలి
-విజయవంతంగా ఫ్లడ్ మాక్ ఎక్సర్‌సైజ్
-మాక్ డ్రిల్‌ను పరిశీలించిన కలెక్టర్





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలని, విపత్తు నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు జిల్లా యంత్రాంగాన్ని మాన్సూన్ సీజన్‌కు పూర్తిస్థాయిలో సిద్ధం చేసేందుకు చేపట్టిన ఫ్లడ్ మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ దివాకర టిపిఎస్ తెలిపారు. జిల్లాలోని మున్నేరు పరివాహక ప్రాంతంలో జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డిఎంఏ) మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన మేరకు సోమవారం వరద ప్రమాదాల మాక్ ఎక్సర్‌సైజ్‌ను కలెక్టర్ దివాకర టిపిఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదలు వంటి విపత్తు సమయంలో అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ప్రాణ నష్టం నివారించవచ్చునన్నారు. సాధారణంగా ప్రజలు నీరు కళ్లకు కనిపించే వరకు ఇండ్లను ఖాళీ చేయరని ఈ ధోరణిలో మార్పు రావాల్సి ఉందన్నారు. అధికారులు అధికారికంగా ఎవాక్యుయేషన్ సూచనలు ఇచ్చినప్పుడు ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని సూచించారు. వర్షాకాలంలో సంభవించే అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుండి సమాచారం అందిన వెంటనే వివిధ శాఖలు ఏవిధంగా స్పందించాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, రెస్క్యూ బృందాలు ఎలా పనిచేయాలి, రిలీఫ్ క్యాంపులను ఎలా నిర్వహించాలి వంటి అంశాలపై స్టెప్‌బై స్టెప్ విధానంలో మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య, ఆరోగ్య, విద్యుత్, పోలీస్, టిపిఎస్ టిడి, అగ్నిమాపక, పశుసంవర్ధక శాఖ, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విపత్తు సమయంలో చేపట్టాల్సిన చర్యలపై సాధన నిర్వహించినట్లు తెలిపారు. ఈ మాక్‌డ్రిల్ ద్వారా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవచ్చునన్నారు. మాక్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా వరదల కారణంగా మున్నేరు పరివాహక ప్రాంతం ముంపుకు గురవుతుందన్న సమాచారం అందుకున్న జిల్లా కంట్రోల్ రూము సంబంధిత అధికారులను, రెస్క్యూ బృందాలను అప్రమత్తం చేసింది. ఆపదమిత్ర, వాలంటీర్ల సహకారంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి రాంలీల ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. వరదల సమయంలో ప్రజలు ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని ఆధార్‌కార్డు,రేషన్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకాలు, భూ పట్టాలు వంటి వాటిని తమ విలువైన వస్తువులను వాటర్ ప్రూఫ్ జిప్ బ్యాగ్‌లలో జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ఖమ్మం జనరల్ ఆసుపత్రి వద్ద వరదలలో ఎవరైనా చిక్కుకుంటే వారిని సంరక్షించి వైద్య సేవలు అందించేలా మాక్ ఎక్సర్‌సైజ్ చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డివో శ్రీనివాస్, ఎన్‌డిఆర్‌ఎఫ్ ఆరవ బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ బి. మరియదాస్, ఎన్‌డిఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్, వివిధ శాఖల అధికారులు, రెస్క్యూ బృందాలు, ఆపద మిత్ర వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ ఎరువులను వాడండి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సత్తుపల్లి మండలం సిద్ధారం గ్రామంలో సోమవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. జె. హేమంత కుమార్ ముఖ్య అతిదిగా హాజరై మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. సిఫారసు చేసిన మోతాదులోనే ఎరువులు వాడాలని, పంట మార్పిడి, సాగునీటి పొదుపు పాటించి వానాకాలం సాగుకు సిద్ధం కావాలని సూచించారు. వరి విస్తీర్ణం తగ్గించి ఆయిల్‌పామ్ సాగును పెంచాల్సిన అవసరం ఉందని, ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు, చీడపీడల యాజమాన్యంపై రైతుల సందేహాలు నివృత్తి చేశారు. అనతరం డా. ఎ. శ్రీజన్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ ప్రాముఖ్యతను వివరించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను మాత్రమే సాగు చేస్తే రైతులు అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. వివిధ పంటల్లో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మండల వ్యవసాయ అధికారి వై. శ్రీనివాస రావు, సిద్ధారం సర్పంచ్ టి. మధు, వ్యవసాయ విస్తరణాధికారి ఆశాజ్యోతితో పాటు పెద్ద సంఖ్యలో రైతు సోదరులు పాల్గొన్నారు.

# పామాయిల్ తోటలో అగ్నిప్రమాదం



-రెండు ఎకరాల్లో చెట్లు దగ్ధం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రమాదవశాత్తు పామాయిల్ తోటకు నిప్పంటుకుని రెండు ఎకరాల్లో పామాయిల్ చెట్లు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని చిమ్మపూడి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు ఎనిమిదేండ్ల క్రితం ఏడు ఎకరాల పామాయిల్ సాగు చేశాడు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో చెట్లకు నిప్పంటుకుని రెండు ఎకరాల్లో పామాయిల్ చెట్లు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి పామాయిల్ తోటకు వెళ్లి పరిశీలించారు. ఈ అగ్నిప్రమాదంలో 50 చెట్లు పూర్తిగా కాలిపోయాయని రెండు ఎకరాల్లో మిగిలిన చెట్ల కొమ్మలు కాలిపోయినట్లు తెలిపారు. చేలల్లో చెత్తను కాల్చేందుకు ఏర్పాటు చేసిన మంటల వల్ల ఈ ప్రమాదం జరిగిందా మరేవిధంగా జరిగిందో తెలియాల్సి ఉందన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ఆదుకోవాలని తెలిపారు. రైతులు తమ పొలాల్లో చెత్తను కాల్చే సమయంలో చుట్టు పక్కల పంట చేలకు నష్టం లేకుండా చూసుకోవాలని, ప్రమాదవశాత్తు మంటలు అంటిన వాటిని అదుపు చేసేందుకు నీళ్ల ఉంచుకోవాలని, మంటలు ఆరిపోయే వరకు మనుషులు ఉండాలని సూచించారు. తోటను పరిశీలించిన వారిలో మాజీ మండల రైతు కన్వీనర్ దొంత సత్యనారాయణ, ఏఎంసి మాజీ డైరెక్టర్ గండ్ర ముత్తయ్య, వార్డు సభ్యులు దంతాల వెంకటేష్, స్థానికులు నాగండ్ల పాపారావు, యర్రా చిన్నవెంకటరెడ్డి, కాళంగి వీరబాబు, బాగం గురవయ్య, బాగం కోటయ్య, మద్దుల అంజయ్య, పోతురాజు ఉపేందర్, సచ్చు వేణు, నాగయ్య ఉన్నారు.

# 23 వరకు పర్యాటక వారోత్సవాలు

-పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 18 నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాలను జిల్లాలో విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ దివాకర టిపిఎస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ దివాకర టిపిఎస్ పర్యాటక వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 20న ఖమ్మం ఖిల్లాలో హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నట్లు, మే 21న జిల్లాలోని పర్యాటక ప్రదేశాలపై యుట్యూబ్ వీడియో ప్రజంటేషన్ చేసిన వారికి టూరిజం సర్టిఫికెట్లు ప్రధానం చేయబడుతుందన్నారు. మే 22న నేలకొండపల్లి బుద్ధనిస్తూపం వద్ద స్వచ్ఛత, పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సునీల్‌రెడ్డి, తెలంగాణ టూరిజం అసిస్టెంట్ ఇంజనీర్, టూరిజం ఉద్యోగి చంద్రశేఖర్ ఆజాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతో డివిజన్ల అభివృద్ధి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజల సహకారంతో డివిజన్ల అభివృద్ధికి కృషి చేసినట్లు మాజీ కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం మాజీ కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు శైలజ దంపతుల డివిజన్‌లోని కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ నెల ఏడున కార్పొరేటర్ పదవి కాలం ముగిసిన సందర్భంగా గత పదేళ్లుగా ఐదు, ఆరు డివిజన్ల అభివృద్ధికి నాగండ్ల కోటేశ్వరరావు చేసిన సేవలకు గుర్తుగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు, కార్మికుల సహకారంతో డివిజన్ల అభివృద్ధికి తన వంతు కృషి చేసినట్లు తెలిపారు. కార్మికులకు నిత్యం సూచనలు అందిస్తూ పారిశుధ్య లోపం తలెత్తకుండా డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేసినట్లు తెలిపారు. ఐదేండ్లు సహకరించిన ప్రజలకు, కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జవాన్ రామకృష్ణ, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పాతర్లపాడులో మొక్కజొన్నని గోడౌన్‌కు తరలించాలి



**ప్రజాపక్షం/చింతకాని :** నాగులవంచ సహకార సంఘం పరిధిలోని పాతర్లపాడు గ్రామంలో కాటావేసిన మొక్కజొన్న బస్తాలని వెంటనే గోడౌన్‌కు తరలించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామ రైతులు సోమవారం జిల్లా కలెక్టర్ దివాకర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ గత నలభై రోజుల నుండి మొక్కజొన్న బస్తాలు కాటాలు వేసి రైతులు కాపలా కాస్తున్నారని, ఇటీవల అగ్నిప్రమాదానికి కొందరి రైతుల మొక్కజొన్న దగ్ధమైందని అధికారులు సందర్శించి నివేదికలు ఇచ్చారే తప్ప వారికి పరిహారం అందజేయడంలో విఫలమయ్యారన్నారు. బస్తాలు తరలించకుండా తాత్సారం చేస్తున్నారని, తక్షణమే బస్తాలు తరలించకపోతే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మండెపుడి రామారావు, తుమ్మలపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వ్యాయామాలు ఆరోగ్యానికి ఉపయోగకరం



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం వైరా రిజర్వాయర్ బతుకమ్మ ఘాట్ వద్ద ఉదయం యువజన వారోత్సవాలు కార్యక్రమం మండల పరిషత్ అధికారి సక్రియ ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ సోమవారం వైస్ చైర్మన్ కట లసంతోష్, కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణతో కలిసి యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం యోగా వాకింగ్, నియమాలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని ప్రజలు తప్పకుండా వాటిని అలవాటు చేసుకోవాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా అదనపు ఎస్సై పవన్‌కుమార్, డాక్టర్ హర్ష, విద్యాశాఖ అధికారి సిహెచ్.శ్రీనివాసరావు, సూపరిండెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇండోర్ స్టేడియం కోచ్ అంజాద్, పలువురు మున్సిపల్ సిబ్బంది,పంచాయతీకార్యదర్శులు,ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఏసీ రాజధాని బస్సులు ప్రారంభం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రయాణికుల సౌకర్యార్థం సత్తుపల్లి నుంచి హైదరాబాద్ కు లహరి నాన్ ఏసీ స్లీపర్ కం సీటర్ బస్సును సూపర్ లగ్జరీ చార్జీతో నడుపుతున్నట్లు డిపో మేనేజర్ గురజాల లక్ష్మీ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వీస్ నెం. 8885 బస్సు సత్తుపల్లి నుంచి రాత్రి 11:15 గంటలకు, సర్వీస్ నెం. 8886 బస్సు హైదరాబాద్ బిహెచ్‌ఈఎల్ నుంచి రాత్రి 9:00 గంటలకు బయలు దేరుతుందన్నారు. వేసవిలోవేసవిలో ప్రయాణికుల కోసం సత్తుపల్లి బిహెచ్‌ఈఎల్ మధ్య ఏసీ రాజధాని బస్సులను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని డిఎం తెలిపారు.

**ఏసీ బస్సు వేళలు...**

సత్తుపల్లి నుంచి బిహెచ్‌ఈఎల్: ఉ. 7:45, 9:15, 10:00 . రా. 9:00, 9:45, 10:30

బిహెచ్‌ఈఎల్ నుంచి సత్తుపల్లికి: ఉ. 8:00, 9:00, 10:00, రా. 9:00, 10:00, 11:00

## ప్రత్యామ్నాయ సాంస్కృతిక సైన్యాన్ని తయారు చేయాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలం పాటిమీదగుంపు గ్రామంలో జరుగుతున్న ప్రజానాట్యమండలి జిల్లా స్థాయి పాటల శిక్షణా శిబిరం రెండో రోజు విజయవంతంగా కొనసాగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎ జబ్బార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్న ఈ పరిస్థితుల్లో ప్రజల కోసం ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం సాంస్కృతిక సైన్యాన్ని తయారు చేయాలని పిలుపునిచ్చారు. మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ శిబిరానికి ప్రజానాట్య మండలి జిల్లా ఉపాధ్యక్షుడు కే నరేంద్ర ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తుండగా, పాటల పెద్దన్న జగన్, వేముల సదానంద్ శిక్షకులుగా శిక్షణ అందిస్తున్నారు. ఈకార్యక్రమంలో నామ లక్ష్మీ నారాయణ, మోటమర్రి జగన్మోహన్‌రావు, మార్తి కొండల్‌రావు, కొండబోయిన నాగేశ్వరరావు, ఉమా, వజ్జ రామారావు, సూరపాక సర్వయ్య, ధనమ్మ, బచ్చల బుజ్జమ్మ, దారావత్ వినోద్ కుమార్, ఉప్పాల రమాదేవి, దరావత్ సరిత, ఈసం వీరస్వామి, దరావత్ రవి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/పాల్వంచ :** పట్టణ పరిధి సీతారామపట్నంలో గల 33/11 కేవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో పెరిగిన విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ల సామర్థ్యం పెంపు పనులను చేపడుతున్నామని కావునా నేడు ఉదయం ఏడు నుండి ఎనమిది గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పాల్వంచ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రహీముల్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పాల్వంచ, గాంధీ నగర్, సీతారామపట్నం, నవభారత్, ఎర్రగుంట, శేఖరం బంజెర, మంచికంటి నగర్, అయ్యప్ప నగర్, పాలకోయతండా, జగ్గుతండా తదితర ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## జూలూరుపాడులో 2కె రన్



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జూలూరుపాడు మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం నుంచి స్థానిక పోలీస్ స్టేషన్ వరకు 2 కె రన్ నిర్వహించారు. సోమవారం జూలూరుపాడు మండలంలో 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, గ్రామ పంచాయతీ సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు 2కె రన్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ తాళ్లూరి రవి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యాచరణలో యువకులు, విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యం, శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసానికి వ్యాయామం, పరుగు ముఖ్యమన్నారు. యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఫిట్, ఆక్టివ్ తెలంగాణ, మారథాన్, ఫిజికల్ లిటరసీపై 2కె రన్ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. ఉదయం ఆరు గంటలకు ప్రారంభించిన మారథాన్ సాయిబాబా టెంపుల్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు సాగిందన్నారు. మారథాన్ కార్యక్రమంలో ఎస్ఐ బాదావత్ రవి, ఎంపిఓ తులసీరామ్, సర్పంచ్లు కోర్సా రమేష్, భూక్య జ్యోతి, కృష్ణ,ఉప సర్పంచ్ నరేష్, నవీన్, ఈజీఎస్ ఏపీఓ రామారావు, ఉసికల నరసింహారావు, వేల్పుల బోస్, రైస్ మిల్ రాజు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ సమస్యలపై వినతి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సర్పంచ్ కొరసా అలివేలు, ఉప సర్పంచ్ వెన్న అశోక్ కుమార్ పాల్గొని పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. చింతిర్యాల క్రాస్ రోడ్ నుంచి చింతిర్యాల వరకు ధ్వంసమైన బీటీ రోడ్డు వెంటనే నిర్మించాలని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో ఎల్ 3లో ఉన్న 10 అర్హ కుటుంబాలను ఎల్ 1 లోకి మార్చి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇసుక తరలింపులో అధికారులు ఇబ్బందులు కల్పించకుండా చూడాలని, ఏజెన్సీ ప్రాంత గిరిజనేతరులకు ఎటువంటి షరతులు లేకుండా ఇంటి పట్టాలు ఇవ్వాలని వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి హామీ పనుల ప్రారంభం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** రామచంద్రపురం గ్రామ పంచాయితీ పరిధిలో సర్పంచ్ భూరెడ్డి స్వాతి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. కూలీల సౌకర్యార్థం టెంట్, మంచినీటి సౌకర్యం, మెడికల్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయితీ పెద్దలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## యువత టూరిజం అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**- టూరిజం క్లబ్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** యువత టూరిజం రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మే 18 నుండి 23 వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా కలెక్టర్ సోమవారం టూరిజం క్లబ్ పోస్టర్‌ను తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంకిత్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాల ఉన్నాయని, యువత టూరిజం రంగంపై అవగాహన పెంచుకుని ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు యువతలో పర్యాటక ప్రదేశాల పట్ల ఆసక్తిని పెంచడంతో పాటు వారసత్వ సంపద పరిరక్షణపై అవగాహన కల్పిస్తాయని చెప్పారు. జిల్లాలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో నేటి నుండి 23 వరకు పలు కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్స్ ఆన్ మ్యూజియాలజీ, ఆర్కియాలజీ కోర్సులను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు కోర్సుల పూర్తి వివరాల కోసం 9849905722 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

**- ఎస్ఆర్టీ ఏరియా పరిరక్షణ బాధ్యులు గూడెల్లి యాకయ్య**



**ప్రజాపక్షం/చుంచుపల్లి :** సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రుద్రంపూర్ గ్రామపంచాయతీకి చెందిన ఎస్ఆర్టీ ఏరియా బాధితులు 50 మంది కలెక్టర్‌ను కలిసి ఇందిరమ్మ ఇండ్ల కోసం వినతిపత్రం ఇవ్వడానికి వెళ్ళగా కలెక్టర్ అంకిత్ అందుబాటులో లేని కారణంగా హౌసింగ్ పీడీకి వినతిపత్రం అందజేయడం జరిగింది. అంతేకాకుండా వ్యక్తిగతంగా కూడా ధరఖాస్తులు అందజేసారు. ఈ సందర్భంగా ఎస్ఆర్టీ ఏరియా పరిరక్షణ భాధ్యులు గూడెల్లి యాకయ్య హౌసింగ్ పీడీకి వారి గోడును వినిపించారు. రుద్రంపూర్‌లో ఎస్ఆర్‌టి ఏరియాను తొలగించి సుమారుగా రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికి ఇప్పటి వరకు అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం లేదని అందువల్ల మేము చెట్టుకొకరం పుట్టకొక్కరముగా చెల్లా చెదురైనామని, నివసించుటకు ఇల్లు లేక ఇల్లు కట్టుకునే స్థోమత లేక నానా అవస్థలు పడుతున్నామని తెలియజేసారు. స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మా విషయమై జోక్యం చేసుకోని ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాముచందర్, జయరాజు, ఉష, రాజు, ప్రసాద్, కృపాల్, హరీష్, అఫ్సార్, సారయ్య, హసులా, వెంకటరత్నం, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలి



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** సిపిఎం పార్టీ జూలూరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో పెట్రోల్ డీజిల్ ధరలు పెంపుకు నిరసనగా సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజలపై భారాలు మోపడం ఆనవాయితీ అని దాని నిజం చేస్తూ నూతనంగా దేశంలో ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగి వెంటనే దేశ ప్రజలపై భారాలు మోతుకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం జరిగింది కాదని పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం వల్ల పరోక్షంగా ఇది సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై రైతాంగం పై భారం పడుతుందని ఆయన అన్నారు. అలాగే పరోక్షంగా వ్యవసాయం నిత్యవసర వస్తువులు ధరలు పెరిగే అవకాశం ఉందని కానీ ఇవేమీ ఆలోచించకుండా సామాన్య ప్రజలపై అధిక భారం పడే విధంగా కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిందని దీనిని నిరసిస్తూ పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా జూలూరుపాడు మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు వలమల్ల చంద్రరావు, గార్లపాటి వెంకటి, పదం సుగుణ, పేరుమాల్ల వెంకటేశ్వర్లు, జరుకుల మల్లయ్య, బొల్లి లక్ష్మయ్య, బోడ అభిమిత్ర తదితరులు పాల్గొన్నారు.

## పాలేరులో మత్స్యకారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ప్రారంభం



**ప్రజాపక్షం/కూసుమంచి:** పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని పాలేరు మత్స్య పరిశోధన స్థానం ఆధ్వర్యంలో తెలంగాణ మత్స్యశాఖ సహకారంతో జలాశయాలలో చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులు అంశంపై మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆర్థిక సహకారంతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, ఖమ్మం జిల్లాలకు చెందిన 25 మంది మత్స్యకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ చంద్రావతి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మంచినీటి చేపలకు డిమాండ్ పెరుగుతోందని, తెలంగాణ మత్స్యకారులు శాస్త్రీయ పద్ధతులు అవలంభించే చేపల ఉత్పత్తిని పెంచుకోవాలని సూచించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ పరిశోధన స్థానం ద్వారా ఇప్పటి వరకు 4వేల మందికి పైగా మత్స్య రైతులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. డాక్టర్ జి గణేష్ మత్స్య రంగ ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పించారు. మత్స్యశాస్త్రవేత్త బి రవీందర్ హేచరీ యూనిట్, బయోఫ్లాక్, సమీకృత చేపల పెంపక విధానాలను క్షేత్రస్థాయిలో వివరించారు. పి శాంతన్న చేప పిల్లల ఎంపిక, రవాణాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించగా, కుమారి బి దివ్య జలాశయాల్లో పెంచదగిన చేప జాతులపై అవగాహన కల్పించారు. డాక్టర్ కే అరుణ్ నీటి కలుపు మొక్కల నిర్మూలన పద్ధతులను వివరించారు.

## అర్హులైన గిరిజనులందరికీ ప్రభుత్వ పథకాలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** అర్హులైన గిరిజన కుటుంబాల వారికి ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ తెలిపారు. సోమవారం ఐటిడిఏ సమావేశం మందిరంలో ఐటిడిఏ పరిధిలోని గిరిజన గ్రామాల నుండి తరలివచ్చిన గిరిప్రజల నుండి ఆయన వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం అందజేశారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ నిజమైన లబ్దిదారులకు ప్రభుత్వం ద్వారా పథకాలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. పరిష్కారానికి నోచుకోని వినతులపై నివేదికలు సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఐటిడిఏ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తతే ప్రాణ రక్షణ

**-బూర్గంపాడులో భారీస్థాయిలో మాక్ డ్రిల్**
**-సమన్వయంతో పని చేస్తే ప్రాణ, ఆస్తి నష్టాలు తగ్గింపు సాధ్యం**
**- కలెక్టర్ అంకిత్**






**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం విపత్తుల నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందని, అత్యవసర పరిస్థితుల్లో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయడం ద్వారానే ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించవచ్చని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11 జిల్లాల్లో సోమవారం నిర్వహించిన విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలో భారీ స్థాయిలో మాక్ డ్రిల్ నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జూమ్ సమావేశం ద్వారా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రజల ప్రాణ రక్షణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, విపత్తుల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందనతో కలిసి మాక్ డ్రిల్‌ను సమీక్షించారు. అనంతరం బూర్గంపాడు మండలంలోని అంబేద్కర్ నగర్ ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి రెస్క్యూ, పునరావాస చర్యలను పరిశీలించారు. ఫైర్ శాఖ అధికారి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్‌లో వరద ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను బోట్లు, లైఫ్ జాకెట్ల సహాయంతో రక్షించడం, అంబులెన్స్‌ల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలించడం, బాధితులకు వైద్య సేవలు, త్రాగునీరు, భోజనం, తాత్కాలిక ఆశ్రయం కల్పించడం వంటి చర్యలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. గజ ఈతగాళ్ల సహాయంతో చేపట్టే రెస్క్యూ విధానాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మాక్ డ్రిల్‌లో భాగంగా బూర్గంపాడు ఎస్సీ కాలనీ నుంచి 10 మంది గర్భిణీలు, 45 మంది చిన్నారులు మొత్తం 200 మందిని, 26 పశువులను సురక్షితంగా బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడ బాధితులకు అత్యవసర వైద్య సేవలు, ఆహారం, త్రాగునీరు, తాత్కాలిక నివాస సదుపాయాలు కల్పించారు. పునరావాస కేంద్రం, వైద్య శిబిరాలు, ఆపరేషన్ సెంటర్లను పరిశీలించిన కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గోల్డెన్ అవర్‌లలో తీసుకునే చర్యలు ప్రాణ రక్షణలో కీలకమని పేర్కొన్నారు. విపత్తుల సమయంలో శాఖల మధ్య సమన్వయం, ముందస్తు అప్రమత్తత, వేగవంతమైన స్పందన ఎంతో అవసరమన్నారు.వైద్య శిబిరాల్లో అందిస్తున్న సేవలు, మందుల పంపిణీ, అత్యవసర వైద్య సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, పునరావాస కేంద్రాల్లో త్రాగునీరు, పరిశుభ్రత, ఆహార సరఫరా, పశువైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాక్ డ్రిల్ ద్వారా జిల్లా యంత్రాంగం అత్యవసర పరిస్థితుల్లో సమన్వయంతో, క్రమ శిక్షణతో పని చేసే సామర్థ్యాన్ని చాటిందని, భవిష్యత్తులో సంభవించే ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈకార్యక్రమంలో జెడ్పి సీఈవో నాగలక్ష్మీ , జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి, భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య, పాల్వంచ సిఐ సతీష్, ఎస్ఐ మేడ ప్రసాద్, సిహెచ్‌సి పర్యవేక్షకుడు ముక్కంటేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్, పీఆర్ ఏఈ చక్రధర్ చారి, సర్పంచ్ మందా నాగరాజు, ఏపీవో విజయ లక్ష్మీ , ఎంపి బంజర్ పిహెచ్‌సి వైద్యులు నగేష్, మండలంలోని వివిధ గ్రామ పంచాయితీ సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం అల్లాడుతున్న ప్రజలు..!

**-కూసుమంచిలో 11 రోజులుగా నీటికి కటకట**
**-మేజర్ గ్రామ పంచాయితీ ప్రజల అవస్థలు**
**-మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల మండిపాటు**



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయితీలో గత 11 రోజులుగా త్రాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో కూసుమంచి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో ప్రజలు త్రాగునీటి కోసం అల్లాడుతున్నారు. గ్రామ పంచాయితీ పరిధిలో వేలాది సుమారు 8000 జనాభా నివసిస్తున్నప్పటికీ సంబంధిత మిషన్ భగీరథ అధికారులు సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైపులైన్ మరమ్మతులు, మోటార్ సమస్యలు వంటి కారణాలు చెబుతూ అధికారులు కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో రోజుకు కేవలం మూడు వాటర్ ట్యాంకర్ల ద్వారానే గ్రామానికి నీటిని అందిస్తున్నారు. అయితే ఆ నీరు కూడా చాలక మహిళలు, వృద్ధులు గంటల తరబడి బిందెలతో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల నీటి కోసం ప్రజల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయని సమాచారం. ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించాలని కూసుమంచి గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ పాల్వంచ పట్టణ కార్యదర్శి మంకెన వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పట్టణ పరిధి నటరాజ్ సెంటర్‌లో ఆ పార్టీ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్‌కు తాడు కట్టి లాగుతూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే ప్రపంచ యుద్ధాలను సాకుగా చూపుతూ సామాన్య ప్రజలపై భారం మోపి ఇందన ధరలను పెంచటం సరికాదన్నారు. వెంటనే ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.లేనిచో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, వెంకటేశ్వర్లు, సంపత్, మహేష్, నగేష్, రాజేష్, రమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**– పేదల నడ్డి విరిచిన బిజేపి :** అమెరికా, ఇరాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధంతో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పేద, సామాన్య ప్రజలపై పెను భారం మోపి నడ్డి విరిచిందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు ఆరోపించారు. శనివారం పాత్రికేయులతో మాట్లాడుతూ ఇప్పటికే తీవ్ర ద్రవోల్బనంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం సామాన్యుడిపై తిరిగి ధరలను పెంచి భారం మోపిందని విమర్శించారు. పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలతో నిత్యావసర సరుకులు ఆకాశాన్నంటే ప్రమాదం ఉందని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని, లేనిచో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామని హెచ్చరించారు.

## అన్నపురెడ్డిపల్లిలో 2కె రన్



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ మారథాన్ సందర్భంగా 2కె రన్ నిర్వహించారు. సర్పంచ్ లకావత్ లక్ష్మీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. గ్రామ పంచాయితీ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల గుండా సాగిన రన్‌లో విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం ప్రతి రోజు వ్యాయామం, ఆరోగ్యకర జీవనం నినాదాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో పంచాయితీ అధికారి షేక్ షబ్నా, డిప్యూటీ తహసీల్దార్ జగదీశ్వరి, ఎస్ఐ విజయసింహారెడ్డి, ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్, ఉప సర్పంచ్ మారగని అశోక్, మండల స్పోర్ట్స్ ఆఫీసర్ సున్నం కృష్ణారావు, ఉపాధ్యాయులు గంగాధర్, రమేష్, కుమార్, వెంకటకృష్ణ, బిచ్చా, గ్రామ కార్యదర్శులు, పంచాయితీ రాజ్, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్తపోటుపై అవగాహన కలిగి ఉండాలి




**ప్రజాపక్షం/ఏన్కూరు:** రక్తపోటుపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి నుండి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తపోటును నియంత్రించండి, ఎక్కువ కాలం జీవించడం అంటూ నినాదాలు చేశారు. సైలెంట్ కిల్లర్ అయిన అధిక రక్తపోటు బ్లబడ్ ప్రెజర్‌ను నిత్యం చెక్ చేయించుకోవాలని కోరారు. అధిక రక్తపోటు అదుపులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగమణి, హెచ్‌వి పద్మ, పుష్పా రాణి, ఏఎన్ఎం జయకుమారి, హెల్త్ అసిస్టెంట్ దుర్గా ప్రసాద్, సూపర్వైజర్ గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ఏన్కూరు:** నకిలీ విత్తనాలు అమితే కఠిన చర్యలు తీసుకుంటామని వైరా ఏడిఏ కరుణ శ్రీ అన్నారు. స్థానిక రైతు వేదికలో సోమవారం డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీలర్లు తప్పని సరిగా తమ లైసెన్సులను రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. స్టాక్ బోర్డు రైతులకు స్పష్టంగా కనిపించేలా పెట్టాలని తెలిపారు. అనుమతి లేని హెచ్‌టి పత్తి విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అడ్వాన్స్ బుకింగ్ పేరుతో రాత్రులు గ్రామాల్లో తిరిగే వారి సమాచారాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా వ్యవసాయ శాఖ లేదా టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియపరచాలని తెలిపారు. ఇటువంటి విత్తనాలు ఎవరు కూడా కొనకుండా ప్రతి ఒక్కరు కృషి చేయలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ నరసింహారావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు భాగ్యలహరి, అశోక్, కోసూరి కమలాకర్, ఏన్కూరు డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టి బాబు, రాయల వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో ఆరోగ్యం



**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రతీ రోజు వ్యాయామం, యోగా చేయటం వలన మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎంపిడిఓ బొగ్గా నారాయణ అన్నారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మండల పరిధి లక్ష్మిదేవిపల్లి పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి పెద్దమ్మతల్లి దేవాలయం వరకు టుకే రన్, యోగా, ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ మారథాన్ మరియు ఫిజికల్ లిటరసి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ యువత క్రమం తప్పకుండా యోగా, వ్యాయామాలు మరియు క్రీడలలో పాల్గొనాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటుగా శారీరక దృఢత్వం, క్రీడా స్ఫూర్తి కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం. శ్రీరామమూర్తి, పాల్వంచ గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ. బి. సురేష్, ఎంపిఓ చెన్నకేశవులు, లక్ష్మిదేవిపల్లి, బసవతారక కాలని సర్పంచ్‌లు బి. మంజుల, జే. కాశమ్మ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ షాపుల బంద్‌కు సహకరించాలని వినతి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ఈనెల 20వ తేదీ బుధవారం నిర్వహించనున్న మెడికల్ షాపుల బంద్ సందర్భంగా అశ్వాపురం తహసీల్దార్ సూర్య ప్రకాశ్, సీఐ అశోక్‌రెడ్డికి మండల కేంద్ర మెడికల్ షాపుల నిర్వాహకులు వినతి పత్రం అందజేశారు. బంద్ కార్యక్రమానికి సహకరించాలని కోరుతూ తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

## -కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజా వినతులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలోని స్టేట్ పంచాయతీరాజ్ చాంబెర్ ఫార్మర్ డైరెక్టర్ భీంరెడ్డి పుల్లారెడ్డి గ్రామంలో ఆర్అండ్‌బి రోడ్డు నుంచి ఎం. అంజయ్య ఇంటి వరకు సిసి డ్రైన్ నిర్మించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. కొణిజర్ల మండలం రాజ్యతండాకు చెందిన టి. సునీత, బి. కృష్ణ, సత్యనాగేంద్ర ముగ్గురు కలిసి గుండ్రాతిమడుగు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 46/ఊ/2/12 లో కొంత భూమి ఉందని వీటి మార్కెట్ విలువ అధికంగా ఉందని దీనిని తగ్గించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరానికి చెందిన మహ్మద్ అబ్దుల్ కరీమ్ టి హబ్ డయాగ్నస్టిక్ సెంటర్ నందు అవుట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నిషియన్‌గా పనిచేస్తున్నప్పుడు టర్మినేషన్ పద్ధతిలో విధుల నుండి తొలగించారని తిరిగి తనకు ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఈవో దీక్షారైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డిఆర్‌సిసిలో పొడి చెత్త రీసైక్లింగ్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** డంపింగ్ యార్డులోని డిఆర్‌సిసి షెడ్‌లో పొడి చెత్తలను రీసైక్లింగ్ చేస్తున్నట్లు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. ప్రతి డివిజన్ నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులోని డిఆర్‌సిసి కేంద్రానికి తరలించి అక్కడ తడి, పొడి చెత్తను వేరు వేరుగా చేసి , పొడి చెత్తను రీసైక్లింగ్‌కు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రజలు కూడా ఇండ్ల వద్దే తడి,పొడి చెత్తను వేర్వేరుగా మున్సిపల్ సిబ్బందికి అందించాలని కమిషనర్ కోరారు. వేసవి దృష్ట్యా డంపింగ్ యార్డులో ట్రాక్టర్, ఆటో డ్రైవర్ల కోసం త్రాగునీటి సదుపాయం కల్పించినట్లు తెలిపారు.




**పచ్చదనాన్ని పెంపొందించాలి :**

ఖమ్మం నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఉద్యానవన అధికారి రాధిక తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యానవన అధికారి రాధిక గార్డెన్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నర్సరీలలో పెంచుతున్న వివిధ రకాల మొక్కలు, వాటి సంరక్షణ వర్షాకాలంలో ఏఏ ప్రాంతాల్లో ఏ మొక్కలు నాటాలి అనే అంశంపై చర్చించారు. నగరంలోని డివైడర్లు, పార్కులు, ప్రధాన రహదారులు, కాలనీలు, ఖాళీ ప్రదేశాల్లో ఎక్కడ మొక్కలు తక్కువగా ఉన్నాయో గుర్తించి ఆయా ప్రాంతాల్లో వర్షాకాలంలో ప్రత్యేకంగా మొక్కలు నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఉద్యానవన అధికారి సూచించారు. ఖమ్మం నగరాన్ని పచ్చదనంతో మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

# పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలి

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పేదలు, సామాన్యులపై బారాలు పడే గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ సత్తుపల్లి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రింగ్ సెంటర్లో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోతున్నాయని, దీనివలన నిత్యవసర సరుకుల ధరలు పెరిగి సామాన్యులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు బతకడం కష్టంగా మారిందని ఆవేధన వ్యక్తం చేశారు. తక్షణమే పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు వెంటనే తగ్గించాలని దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చాక ఇప్పటికీ అనేకసార్లు ధరల పెంచుతూ సామాన్యుడి నడ్డి విరిచే చర్యలకు పాల్పడుతున్నారని ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు పొదుపు చర్యలు పాటించాలని సూక్తులు చెప్పిన ప్రధానమంత్రి ఎన్నికల రిజల్ట్ రావడంతోనే సామాన్య, మధ్య తరగతి, పేద ప్రజలపై పెను భారం పడేలా గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరల పెంచి ఆయన యొక్క నిజస్వరూపాన్ని బయటపెట్టారని దండు ఆదినారాయణ విమర్శించారు. ఈ దేశంలో పేదలు, సామాన్యులు, బడుగు బలహీన వర్గాలంటే గిట్టని మో డీ వారిపై బారాలు పెంచుతూ అదానీ, అంబానీ కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రాయితీలు ఇస్తున్నారని దేశ సంపదను కార్పొరేట్ సంస్థల కు కట్టబెట్టి నిసిగ్గుగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి తడికమళ్ళ యోబు, సత్తుపల్లి పట్టణ సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, టౌన్ కమిటీ నాయకులు కోలేటి వెంకటేశ్వరరావు, ఆటో యూనియన్ అధ్యక్షులు చెరుకు కేశవరావు, వేంసూరు మండల నాయకులు ఎస్.కె లాల్ మహమ్మద్, ఫుట్ పాత్ వ్యాపారుల సంఘం నాయకులు ప్రభాకర్, కృష్ణ, దయామణి, మరియమ్మ, శాంతమ్మ , లక్ష్మి , జ్యోతి, వెంకటమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

# క్రీడలతోనే దేశభక్తి భావం పెంపు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** క్రీడలతోనే క్రీడా స్ఫూర్తి, దేశభక్తి భావం, యువశక్తి వికాసం పెంపొందుతాయని జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యువజన క్రీడా వారోత్సవాలను ఖమ్మం సర్దార్ పటేల్ మైదానంలో ప్రారంభించారు. 5కె రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సునీల్‌రెడ్డి మాట్లాడుతూ యువతలో శారీరక ధృడత్వం,నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, చైతన్యం, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే ఈ వారోత్సవాల లక్ష్యమని తెలిపారు. క్రీడలు ఉపాధి అవకాశాలకు కూడా తోడ్పాడతాయని తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ కార్యక్రమం క్రింద యోగా, ఏరోబిక్స్, మెడిటేషన్, 5కె రన్ నిర్వహించినట్లు తెలిపారు. రెండవ రోజు మంగళవారం సర్దార్ పటేల్ మైదానం ఖమ్మం నందు కెరీర్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంపవర్ స్కిల్, స్కిల్ ఎంపవర్ ఫ్యూచర్ అనే అంశంపై కార్యక్రమం నిర్వహించబడుతుందని యుట్యూబ్‌లో లైవ్ ప్రసారమవుతుందని క్రీడాకారులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ ఉదయ్‌కుమార్, నాగమణి, కోచ్‌లు గౌస్, ఎస్ఎస్ఎస్ మూర్తి, చారి, చంద్రకాంత్, కైలాష్, కొండలు, మోహన్, నాగరాజు, సురేష్, హరీష్, నోయల్ జాక్సన్, సీనియర్ బ్యాడ్మింటన్ ప్లేయర్లు, మారథాన్ ప్లేయర్లు, సిబ్బంది , క్రీడాకారులు, వాకర్స్, విద్యార్థులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ జెడ్పీటిసి దొండపాటి రమేష్, సిపిఐ జిల్లా నాయకులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సోమరవారం జిల్లా కల్టెర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారుమ మాట్లాడుతు రేకులకింద నివసించేవారికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని ఎంతో ఆశతో ఎదురు చూశారని ఇళ్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా గుర్తించిన కొణిజర్ల మండలంలోని చిన్నగోపతి గ్రామంలో కూడా అర్హులైన వారికి ఇళ్లు రాకపోవడం విచారకరమని అన్నారు. 2005లో ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో ఇందిరమ్మ పథకం కింద రాజకీయాలకు అతీతంగా ఇళ్లు వచ్చాయని తెలిపారు. తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు దేరంగుల లక్ష్మయ్య, తమ్మిశెట్టి ఉపేందర్, చిన్నగోపతి ఉపసర్పంచ్ తమ్మిశెట్టి విజయ, దేరంగుల దినేష్, తమ్మిశెట్టి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# పాదాచారుల రక్షణకు భద్రతా చర్యలు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో పాదాచారుల భద్రతకు రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం తెలిపారు. ఖమ్మం నగరంలోని ప్రధాన రహదారులు, ట్రాఫిక్ కూడళ్ల వద్ద పాదాచారుల భద్రత కోసం జీబ్రా క్రాసింగ్ లైన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా రోడ్డు దాటే పాదాచారులకు సురక్షిత మార్గం కల్పించినట్లు తెలిపారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించడం లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాదాచారులు జీబ్రా క్రాసింగ్‌లను వినియోగించుకోవాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని కోరారు.

# విద్యారంగానికి పెద్దపీట



**ప్రజాపక్షం/వైరాః** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం వైరా మండల పరిషత్ కార్యాలయం నందు నిర్వహించారు. ఈ సంవత్సరం మార్చిలో పదో తరగతి పరీక్షలు వ్రాసిన విద్యార్థుల్లో ప్రభుత్వ, గురుకుల, ప్రైవేటు పాఠశాలల్లో అధిక మార్కులు సాధించిన ప్రతి పాఠశాల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో చావా శ్రీనివాసరావు అధ్యక్షతన విద్యార్థులకు సన్మానం చేసి సర్టిఫికెట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కట్ల సంతోష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఖమ్మం జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షులు కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత కనబరిచిన విద్యార్థులను అభినందించడం అభినందనీయమని అన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చవా శ్రీనివాసరావు, 13వ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయలక్ష్మి , వైరా ఎండివో సక్రియనాయక్, మందడపు రామారావు, పలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్యానికి ఎన్నో ఉపయోగాలు



**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఏన్కూరులో యోగాతో ఆరోగ్యానికి ఎన్నో ఉపయెగాలు ఉన్నాయని మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్ అన్నారు. యువజన ఉత్సాహల్లో భాగంగా సోమవారం 2కే రన్ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రధాన సెంటర్ వరకు రన్ చేపట్టారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఛైర్మన్ లచ్చిరాం నాయక్ యోగాసనాలు వేసి చూపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక శ్రమ లేకపోవడం వల్లనే రోగాలు వస్తున్నాయని అన్నారు. రోజు వ్యాయామం, నడక వల్ల ఆరోగ్యవంతులుగా తయారు అవుతారని, ప్రతి ఒక్కరూ తప్పకుండా వ్యాయామాలు చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీఓ జివిఎస్ నారాయణ, ఆర్ఐ శ్రీనివాస్, గ్రామ పంచాయితీ కార్యదర్శులు రవి కుమార్, సురేష్, ప్రసాద్, గోపి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీ లేని సమాజం కోసం పోరాడాలి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం గ్రామంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. మాజీ సర్పంచ్ పాయం భద్రయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలగాని బ్రహ్మచారి, రేపాకుల శ్రీనివాసులు మాట్లాడుతూ దోపిడీ, వివక్ష లేని సమాజం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఎం పార్టీ విశిష్టతపై కొలగాని బ్రహ్మచారి, సీపీఎం పార్టీ నిర్మాణంపై రేపాకుల శ్రీనివాసులు బోధించారు. ఈకార్యక్రమంలో గద్దల శ్రీనివాస్, పాయం నర్సింహారావు, అశోక్‌రెడ్డి, ఎన్వీ భద్రయ్య, మోకాళ్ల రమేష్, పాయం విజయ, బొడ్డు రాములు, జానకమ్మ, మోకాళ్ల తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ అక్రమాలకు చెక్..!



- కొనసాగుతున్న 'చేయూత' ఇంటింటి సర్వే
- మృతుల పేర్లు ఏరివేత
- జిల్లా వ్యాప్తంగా 1,13,840 మంది లబ్ధిదారులు
- పెన్షన్ దుర్వినియోగం కాకుండా యాప్‌లో నమోదు
- మోసాలను అరికట్టేందుకు లైవ్ అథెంటికేషన్
- జూన్ 15 వరకు సర్వే

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రభుత్వం అందిస్తున్న చేయూత పెన్షన్లు పక్కదారి పడుతున్న విషయాన్ని గమనించిన ప్రభుత్వం దుర్వినియోగానికి చెక్ పెట్టేందుకు ఇంటింటి సర్వే మొదలు పెట్టింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజుల నుండి సర్వే కొనసాగుతోంది. నెల రోజుల పాటు జరిగే ఈ సర్వేలో గతంలో పెన్షన్ పొందుతూ మృతి చెందిన వారిని జాబితా నుండి తొలగించే ప్రత్యేక ఏరివేత కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు వారి ఇంటి వద్ద లైవ్‌నెస్ అథెంటికేషన్‌ను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి నిర్ధారిస్తున్నారు. గ్రామ పంచాయితీ కార్యదర్శులు, జీపిఓలు, మున్సిపాల్టీల్లో వార్డు ఆఫీసర్లు చేయూత లబ్ధిదారుల జాబితాతో గడపగడప సర్వే మొదలు పెట్టారు. జిల్లాలోని 23 మండలాల్లోని వివిధ క్యాటగిరీల్లో 113840 మంది లబ్ధిదారులు చేయూత పెన్షన్లు ప్రభుత్వం నుండి నెలనెలా అందుకుంటున్నారు. ఇదిలా ఉండగా వీరిలో ఇప్పటికే కొందరు మృతి చెందినట్లు గుర్తించారు. కానీ వారి వారసులు డిఆర్‌డిఏ, మెప్మా వంటి విభాగాలకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచి లబ్ధిదారుల పేరున బ్యాంకు ఖాతాల్లో పెన్షన్ సొమ్ములు జమవుతుండగా వాటిని ఏటిఎం ద్వారా తీసుకుంటున్నారు. ఫలితంగా ఆ నోటా ఈ నోటా విషయం బయటకు పొక్కి అధికారుల దృష్టికి చేరింది. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం అక్రమాన్ని అరికట్టేందుకు సర్వేకు శ్రీకారం చుట్టింది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి లబ్ధిదారులు జీవించి ఉన్నట్లు లైవ్‌నెస్ అథెంటికేషన్ అప్‌లోడ్ చేసి అర్హులను నిర్ధారిస్తున్నారు.

**అక్రమాలకు చెక్ :** మరణించిన లబ్ధిదారుల పేరుతో చేయూత పెన్షన్ దుర్వినియోగానికి చెంక్ పెడుతున్నారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా నమోదు చేస్తున్నారు. దీంతో మరణించిన వారిని తొలగించేందుకు అధికారికంగా సాధ్యమవుతోంది. పూర్తిస్థాయిలో తొలగింపుకంటే ముందే మరణించిన వారి జాబితాను ఆయా ప్రాంతాల్లో ప్రకటించి వాస్తవాలను మరో సారి నిర్ధారించనున్నారు. అనంతరం గ్రామసభ నిర్వహించి జీవించి ఉన్న వారి పెన్షన్ ఎప్పటిలాగానే లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానుంది. తద్వారా దుర్వినియోగానికి చెక్ పడనుంది.

**నిజమైన పేదవర్గాలు మేలు చేసేందుకు :** ప్రభుత్వం అందిస్తున్న చేయూత పెన్షన్ నిజమైన పేదవర్గాలకు మేలు చేకూర్చేలా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రక్షాళనకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ఫ్),జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలతో పాటు పట్టణ పేదిరక నిర్మూలన సంస్థ (మెప్మా) మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ద్వారా కమీషనర్లుకు ఆదేశాలు జారీ చేసారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం, టాటా కన్సల్టెనీ సర్వీసెస్ (టిసిఎస్) సంయుక్తగా టిజి ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి ఫేస్ రికగ్నైజేషన్ చేస్తున్నారు. అధార్ అథెంటికేషన్ ద్వారా కోర్ బ్యాంకింగ్ సర్వీస్ ద్వారా చేయూత లబ్ధిదారుల లైవ్ అథెంటికేషన్ నమోదు క్షేత్రస్థాయిలో గత రెండ్రోజులుగా కొనసాగుతున్నాయి.

**జిల్లాలో లబ్ధిదారులు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జాతీయ సామాజిక భద్రతా పథకం చేయూత క్రింద వివిధ కేటగిరీలకు చెందిన 1,13,840 మంది లబ్ధిదారులు ప్రస్తుతం జాబితా ప్రకారం ఉన్నారు. వీరిలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలతో పాటు తొమ్మిది కేటగిరీలకు చెందిన లబ్ధిదారులకు ప్రయోజనం చేసూరుతోంది. వీరిలో వృద్ధాప్య పింఛన్ దారులు 42860, వింతతు 49369 ఒంటరి మహిళలు 6150 దివ్యాంగ 13101, గీత కార్మికులు 141,పైలేరియా వ్యాధిగ్రస్తులు 159, మూత్రపిండాల డయాలసిస్ రోగులు 249, బిడి కార్మికులు 04, ఏఆర్‌టి 1791 మంది ఉన్నారు. స్వయంగా లబ్ధిదారులకే సొమ్ములు అందాలనే ఉద్దేశ్యంతో పంచాయితీలు, మున్సిపాలిపల్, పోస్టాఫిస్‌ల ద్వారా పంపిణీ చేశారు. ఆ తర్వాత బయో మెట్రిక్ విధానం అమలు చేశారు. క్రమంగా బ్యాంకు ఖాతాల ద్వారా డిజిటి విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో మరణించిన వారి పేర్లమీద కూడా బ్యాంకు ఖాతాల్లో నగదు జమలు అవుతున్నట్లు గుర్తించారు. దీంతో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఫేస్ రికగ్నైజేషన్ నమోదు చేసి లైవ్‌ఫేస్ అథెంటికేషన్ నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

# వైరా మున్సిపాలిటీలో చెత్త వాహనాలు ఎక్కడ?







- ఉన్నవి ఎన్ని..?తిరుగుతున్న వాహనాలు ఎన్ని..?
- వార్డుల్లోకి చెత్త వాహనాలు రావడం లేదంట..!
- పారిశుద్ధ్యంపై పట్టింపు ఏది?
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో పారిశుద్ధ్య అస్తవ్యస్థంగా ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులు ఉన్నాయి. ప్రతిరోజు వార్డులో చెత్తను తీసుకెళ్లాల్సిన చెత్త వాహనాలు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు మైకుల్లో తడి చెత్త చెత్త తేండమ్మ మా చెత్త బంండి మీ ఇంటికి వచ్చింది అని చెప్పే స్పీచ్ గత కొన్ని రోజులుగా మూగబోయింది. ఎందుకు అంటే వారంలో రెండు, మూడు రోజులే చెత్త వాహనాలు కనిపిస్తున్నాయి తప్ప తర్వాత కనిపించడం లేదు అని పలువురు ఆరోపిస్తున్నారు. చెత్త వామనాలు రాకపోతే ఆ చెత్తను ఎక్కడ వేయాలి. గృహాల్లో ఉంచితే దుర్వాసనతో ఇబ్బంది పడుతూ ప్రజల రోగాల బారిన పడే ప్రమాదం సైతం ఉంది. రోడ్ల ప్రక్కన పడేస్తే ఏ విధంగా ఉంటుంది. ఒక్కసారి ఆలోచించండి. అసలు చెత్త వాహనాలకు ఏమైంది ఎందుకు సక్రమంగా రావడం లేదు, ఉన్న వాహనాలపై ఎందుకు పర్యవేక్షణ సక్రంగా లేదు అనేది కూడా ఇప్పుడు ఆలోచించాల్సిన అవసరం ఉంది. కొన్ని వాహనాలు మూలన పడి ఉంటే వాటిని పట్టించుకున్న నాధుడే లేదు. వాహనం తిరగకపోతే ఆ వాహనం ఎందుకు తిరగడం లేదు ఏమైంది అనే బాధ్యత అధికారులు ఎందుకు తీసుకోవడం లేదు. చెత్త వాహనాలను తుప్పుపట్టే విధంగా మూలన పడేస్తున్నారు. తప్ప మనుగడలోకి ఎందుకు తీసుకురాలేకపోతున్నారు. 20 వార్డులో తిరుగుతున్న వాహనాలు ఎన్ని, మూలన పడ్డ వాహనాలు ఎన్ని, ఒక్కసారి ఆలోచించాలి. ఎందుకు అంటే మున్సిపాలిటీలో అత్యంత కీలకమైంది పారిశుద్ధ్యం. ఆ పారిశుద్ధ్యం పైనే పట్టింపు లేకపోతే ప్రజల ఆరోగ్యం ఏ విధంగా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని వైరా మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టకపోతే ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం అనే చెప్పవచ్చును. ఉన్న వామనాలు మెయిన్ రోడ్లకే పరిమితం అవుతున్నాయి. వ్యాపార సముదాయాలకే పరిమితం అవుతున్న తప్ప నివాస దృహాలకు మాత్రం సక్రమంగా పోవడం లేదని చెప్పవచ్చును. వ్యాపారులకు ఒక న్యాయం సామాన్య ప్రజలకు ఒక న్యాయం అనేది కూడా ఇక్కడ కనిపిస్తూ ఉంది. దీనిపై కూడా అధికారులు ఒక స్పష్టమైన దృష్టి సారించాలి. పలు వార్డుల్లో డ్రైనేజీలు శుభ్రంగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త బండి ఎప్పుడు వస్తుంది అని ఎదురుచూస్తున్నారు. ఎదురుచూసి చూసి ఇసుకుచేంది ఇంట్లో ఒక మూలన పడేస్తున్నారు. చెత్తే కదా అని పట్టించుకోకుండా మూలన పడేస్తే ఆ చెత్త కుప్పే ఇంటి పాలిట వ్యాధులకు కారణం అవుతుందని చెప్పవచ్చును. చెత్త తీసుకెళితే వాహనాల డ్రైవర్లపై కూడా పర్యవేక్షణ లేదని చెప్పవచ్చును. ఉదయం మున్సిపాలిటీ కార్యాలయం నుండి బయటికి వెళ్లిన చెత్త వాహనాలు ఎక్కడ తిరుగుతున్నాయి. ఏ ఏరియాలో ఉన్నాయి అనేది కూడా పర్యవేక్షణే కరువైంది. ఉదయం వెళ్లిన చెత్త వాహనాలు సక్రమమంగా తిరిగితే ఉన్న వామనాలతోనే సమస్యను సరిచేయవచ్చు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని పారిశుద్ధ్యంపై పట్టు బిగించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## కాచినపల్లిలో అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలం కాచినపల్లి శివారు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌నను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ఎం సోమేశ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిఘా, తనిఖీల్లో భాగంగా అనుమతులు లేకుండా ఇసుకను ఇల్లందు వైపు తరలిస్తుండగా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణాకు పాల్పడిన ట్రాక్టర్ డ్రైవర్ కుంజ మధు, యజమాని సంతపురి వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రజావాణి వినతులు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజల నుండి ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్రావు అన్నారు. ఆయన సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో ప్రజల నుండి పలు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులపై నమ్మకంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఇక్కడిదాకా వచ్చిన వినతులు సమర్పిస్తుంటారని, వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా అధికారులు వినతుల పరిష్కారానికి పాటుపడాలన్నారు. పరిష్కరించలేని వాటిపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాలకు సంక్షేమానికి పథకాలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** మారుమూల దట్టమైన గిరిజన గ్రామాల అభివృద్ధికి జన భాగీదారీ సబ్సే దూర్ సబ్సే హేహాల్ నినాదంతో మౌళిక సదుపాయాల కల్పనకు అధికారులు గ్రామాల్లోకి వస్తున్నందున గిరిజన గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఏ పిఓ రాహుల్ తెలిపారు. మే 18 నుండి 25 వరకు అధికారులు గిరిజన గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గిరిజన సమస్యలు తెలుసుకుని సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. జాబ్, రేషన్ కార్డులు, ధృవీకరణ పత్రాలు, వైద్య సేవలు తదితర అంశాలపై సేవలు అందించనున్నట్లు చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 130, ఖమ్మం జిల్లాలో 30 గ్రామాల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు కూడా జరుగుతాయని చెప్పారు. ఈ సమావేశంలో పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన గురుకుల ఇంటర్‌లో సీట్లు భర్తీ



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ పరిధిలోని గిరిజన ఇంటర్ కాలేజీల్లో పదో తరగతి మార్కుల ఆధారంగా బాలికలకు సీట్లు భర్తీ పకడ్బందీగా జరిగిందని ఐటిడిఏ పిఓ రాహుల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికల కళాశాల్లో జరుగుతున్న కౌన్సిలింగ్‌కు ఆయన హాజరై సీట్ల భర్తీ ప్రక్రియను పరిశీలించారు. 576 సీట్లకు గానూ బాలికల పదో తరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. గురుకుల ఆర్సిఓ అరుణ కుమారితో కలిసి ఆయన విద్యార్థినీలకు అనుమతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పద్మావతితో పాటు పలు కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

## 2కె రన్ విజయవంతం



**ప్రజాపక్షం/చుంచుపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చుంచుపల్లి మండల అభివృద్ధి అధికారి సుభాషిని ఆధ్వర్యంలో సోమవారం గౌతంపూర్ నుండి రుద్రంపూర్ సెంట్రల్ పార్క్ వరకు 2కె రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2టౌన్ ఎస్ఐ కిషోర్, సర్పంచులు మండలంలోని ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, యువజన సంఘాలు, యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుభాషిని మాట్లాడుతూ గ్రామస్తులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని 2కె రన్ ను విజయవంతం చేశారని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాల పనితీరు ఆదర్శనీయమని ప్రభుత్వ పథకాలు విజయవంతం కావడానికి ప్రజల ఆదరణే కారణమన్నారు. యువజన క్రీడా వారోత్సవాలను పురస్కరించుకొని యువతలో క్రీడా సూర్తి, దేహదారుఢ్యం, సామాజిక చైతన్యం కల్గించేందుకు 2కె రన్, యోగా తదితర కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఫిట్ తెలంగాణ థీమ్‌తో సెంట్రల్ పార్క్‌లో యోగా ఆసనాలలో యువత ఉత్సహంగా పాల్గొన్నారు.

## అడవి మంటల నివారణపై అప్రమత్తత అవసరం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** అడవుల్లో సంభవించే అగ్ని ప్రమాదాలను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్ఓ జి కృష్ణగౌడ్ అన్నారు. అడవి మంటల నివారణ, రక్షణ చర్యలపై నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, మంటలను ఎలా అదుపులోకి తేవాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, వివిధ శాఖలు సమన్వయంతో ఎలా స్పందించాలనే అంశాలపై ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎఫ్ఓ జి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ వేసవి కాలంలో చిన్న నిర్లక్ష్యం కూడా భారీ అగ్ని ప్రమాదాలకు దారితీసే అవకావం ఉందన్నారు. ప్రజలు, అటవీ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ మంటలు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీసీఎఫ్‌లు కె దామోదర్‌రెడ్డి, బి బాబు, ఏసీఎఫ్ కోటేశ్వరరావు, జిల్లా పరిధిలోని రేంజ్ అధికారులు, అటవీ శాఖ సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఫైర్, రెవెన్యూ, పోలీస్, హెల్త్, ఎంపీడీవో, ఎలక్ట్రికల్ శాఖల అధికారులు, సిబ్బంది, ఇతర శాఖల ప్రతినిధులు పాల్గొని అగ్ని మాపక, రక్షణ చర్యలను ప్రదర్శించారు.